

## వడదెబ్బ కారణంగా జడ్చర్ల మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికురాలు మృతి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలుగా పనిచేస్తున్న యస్.యాదమ్మ (52) జడ్చర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లింది. తల నొప్పిగా ఉందని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లింది. అక్కడ వైద్యం చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో వడదెబ్బ కారణంగా మహిళా పారిశుద్ధ్య కార్మికురాలు యాదమ్మ మృతి చేయించినట్లు వైద్యులు తెలిపారు. బుధవారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో యాదమ్మ మృతదేహాన్ని సందర్శించి మున్సిపల్ కమిషనర్ గిరీష్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పది వేలు రూపాయలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులు అందజేశారు.

## 5వ అంతస్తు నుండి కింద పడి కార్మికురాలు మృతి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలోని కావేరమ్మ పేట దగ్గర దయాకర్ రెడ్డి నివాసంలో ఇంటి పనులు జరుగుతుండగా ఐదవ అంతస్తు నుండి చిట్టబోయిన్‌పల్లి గ్రామానికి చెందిన శారదా అనే మహిళా కిందపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సిఐ కమలాకర్ తెలిపారు. బుధవారం నాడు ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 9 గంటలకు శారద తన భర్త రవికి చెప్పి కూలి పని నిమిత్తం కావేరమ్మపేట చేరుకొని ఐదవ అంతస్తులో పనులు చేస్తూ కాలు జారీ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని తమకు సరైన న్యాయం జరగాలని మృతురాలి భర్త రవి డిమాండు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఈ మేర కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

**ప్రజాపక్షం/కృష్ణ :** అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ ను కృష్ణ పోలీసులు బుధవారం సీజ్ చేశారు. కృష్ణ పోలీసులు తెలిపిన ప్రకారం ఎస్‌ఎచ్‌ఓ కృష్ణ పీఎస్ ఆదేశాల మేరకు డయల్ 100 విధులు నిర్వహిస్తున్న సిబ్బంది. బుధవారం తెల్లవారుజామున సుమారు 02:00 గంటల సమయంలో టైరోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా ఒక టిప్పర్ వాహనం (నెంబర్ : TS08 UB 5586) కనిపించగా, వారు ఆ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. తనిఖీ చేయగా ఆ టిప్పర్ లో ఇసుక లోడ్ చేసి ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్ ను విచారించగా, అతను తన పేరు శ్రీరాములు తండ్రి వెంకటప్ప వయస్సు : 37 సంవత్సరాలు, వృత్తి : డ్రైవర్, గ్రామం వడ్వాట్, మండలం మాగనూర్ తెలిపారు. అలాగే వాహన యజమాని ఆదేశాల మేరకు గూడెబల్లూర్ గ్రామ శివారులోని కృష్ణా నది నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తూ, కర్ణాటక రాష్ట్రంలోని సైదాపూర్ గ్రామానికి తరలించి అధిక లాభాల కోసం విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీంతో వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ కేసు నమోదు చేసి ధార్యప్తు చేస్తున్నట్లు కృష్ణ పోలీసులు తెలిపారు.



## ఎస్టీ హాస్టల్‌పై విచారణ

**ప్రజాపక్షం/వెల్దండ :** మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహంలో ఓ మైనర్ విద్యార్థిని గర్భం దాల్చడంపై సమగ్రంగా విచారించి దోషులపై చర్యలు తీసుకోవాలని సరెండర్‌లో ఉన్న వార్డెన్ కొమ్ముజాన్సన్ బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ అదేశాలను జిల్లా అగ్నిమాపకాధికారి గిరిధర్‌రెడ్డి విచారణ నిర్వహించారు.ఈ సందర్భంగా డీటీడీఓ ఫిరంగి, వార్డెన్ కృష్ణవేణి విధుల్లో ఉన్నప్పుడు జరిగిన ఘటనకు తనను బాధ్యుడుని చేస్తూ అకారణంగా సరేండర్ చేయడంపై ప్రజాభవన్ ప్రజావాణిలో కొమ్ము బాబు పాటు బీఎస్పీ జిల్లా అధ్యక్షులు పృథ్వీరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎఫ్ఓ వసతి గృహన్ని సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థినీలకు గత రక్షణ చర్యలతో పాటు పరిసరాలు, నివాస గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డీటీడీఓ ఫిరంగి ఫిర్యాదు దారులు కొమ్ముబాబు, పృథ్వీరాజు, వార్డెన్ కృష్ణవేణి కొత్తగా బాధ్యతలు చేపట్టిన వార్డెన్ మణెమ్మ ఏఎన్ఎం నాగకళ, సిబ్బంది శుక్లీ, యాదమ్మ, పద్మలను ఆయన వేర్వేరుగా విచారించారు. విద్యార్థిని గర్భం దాల్చడం ఫిర్యాదు అంశంపై క్షుణ్ణంగా విచారించినట్లు అధికారి తెలిపారు. ఈ విచారణలో గిరిధర్‌రెడ్డిని వివరణ కోరగా విచారణ నివేదికను జిల్లా కలెక్టర్ నివేదించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్‌వోలు చంద్రశేఖర్‌గౌడ్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యను అందించాలి : ఎంఇఓ

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించి, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని మండల విద్యా అధికారి పి.ఉమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కార్యాలయంలో విద్యాధికారి ఉమాదేవి ఆధ్వర్యంలో బుధవారం ప్రధాన ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బడిబాట వివరాలు ఐదు సంవత్సరాలు పైబడిన పిల్లలను బడిలో చేర్పించడం, ఎస్,జె,డిసీ ఇంకుడు గుంతలపై అవగాహన, తదితర వాటిపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు భారతి, లక్ష్మ ణ్, కంప్యూటర్ ఆపరేటర్ శివలింగం, ఎంఐఎస్ కోఆర్డినేటర్ స్వామి, కాంప్లెక్స్ సీఆర్పీలు పాల్గొన్నారు.

## మురికి కాల్వలు క్లీన్‌చేసిన కౌన్సిలర్

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మున్సిపాలిటీ 15వ వార్డులో బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి మురికి కాలువలు నిండి లేట్ హోటల్ ఖాజా ఇంట్లో మురికి కాలువ నీరు వెళ్లగా విషయం తెలుసుకున్న ఆ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ నారామన్ అయ్యన్న తానే రంగంలోకి దిగి మురికి కాలును తీసి కాలనీవాసులు మన్ననలు పొందారు. అదేవిధంగా బుధవారం పెద్దల పండుగ రేపు బక్రీద్ పండుగ కావడంతో త్రాగునీటి సమస్యను తీర్చాలని ఈ రెండు రోజులు రెగ్యులర్ గా త్రాగునీరు వదలాలని కమీషనర్ సైదయ్యకు కోరారు. గత వారం రోజుల నుండి త్రాగునీరు రావడంలేదని 15వ వార్డు కౌన్సిలర్ అయ్యన్న ముందు వార్డు ప్రజలు అందోళన వ్యక్తం చేశారు. లేట్ హోటల్ ఖాజా ఇంటి ముందు బోరు చెడిపోయిందని మున్సిపాలిటీకి తెలిపిన పట్టించుకోకపోవడం బాధాకరమని అసహనం వ్యక్తం చేశారు.

# రైతుకు కన్నీరు మిగిల్చిన అకాల వర్షం

వీపనగండ్ల మండలంలో తడిసిన వరి ధాన్యం - కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఆందోళన

6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల మండలంలో బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం రైతుల కష్టాన్ని నీటిలో కలిపేసింది. కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో నిల్వ ఉంచిన వేలాది వరి ధాన్యం బస్తాలు వర్షానికి తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మండలంలో 6సెంటీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

**కవర్లు ఎగిరిపోవడంతో ధాన్యం తడిసింది :** అకాల వర్షంతో పాటు ఈదురు గాలులు వీచడంతో ధాన్య బస్తాలపై కప్పిన టర్పాలిన్ కవర్లు పలుచోట్ల ఎగిరిపోయాయి. దీంతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి పూర్తిగా తడిసిపోయింది. తెల్లవారుజామునే రైతులు కేంద్రాలకు పరుగులు తీసి నీరు చేరకుండా బస్తాలను కాపాడేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ భారీ వర్షం కారణంగా పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

**మా శ్రమ నీటిపాలైంది - రైతుల ఆవేదన :** పంట పండించేందుకు అప్పులు చేసి, రేయింబవళ్లు శ్రమించిన తమకు ఈ అకాల వర్షం తీవ్ర దెబ్బతీసిందని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికే కొనుగోలు ప్రక్రియ ఆలస్యం కావడం, కేంద్రాలకు అధికంగా ధాన్యం రావడం, తరలింపులో నిర్లక్ష్యం కారణంగా వేలాది బస్తాలు కొనుగోలు కేంద్రాల వద్దనే పేరుకుపోయాయని తెలిపారు. సమయానికి గోదాంలకు, మిల్లర్లకు తరలించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

**నాణ్యత దెబ్బతింటుందనే భయం :** వర్షానికి తడిసిన ధాన్యం నాణ్యత తగ్గిపోతుందనే భయంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం పెరిగిందనే కారణంతో ధాన్యాన్ని తిరస్కరిస్తారేమోనని భయపడుతున్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రైతులకు ఇది మరింత భారంగా మారింది.

**తడిచిన గోనె బస్తాలు :** మండల పరిధిలోని సంగినేనిపల్లి ఐకెపి వరి కొనుగోలు కేంద్రంలో నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లవేల గోనే బస్తాలు భారీ వర్షానికి తడిచిపోయాయి. తెచ్చిన గోనే బస్తాలను నిర్వాహకులు భద్రపరచకుండా పడి వేయడంతో పూర్తిగా తడిచిపోయాయని రైతులు తెలిపారు.

**వెంటనే కొనుగోలు చేసి ఆదుకోవాలి :** తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన రక్షణ చర్యలు చేపట్టి, నిల్వ ఉన్న ధాన్యాన్ని తక్షణమే గోదాంలకు తరలించాలని కోరుతున్నారు. రైతు కష్టం వృథా కాకుండా అధికారులు మానవతా దృక్పథంతో స్పందించాలని విజ్ఞప్తి చేశారు.



## తహసీల్దార్‌ను నిర్బంధించిన రైతులు

**ప్రజాపక్షం/చిన్నంబావి :** చిన్నంబావి మండలంలోని వెలగొండ ఐకెపి కొనుగోలు కేంద్రంలో రైతులు తహసిల్దార్ ను ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్బంధించారు. అకాల వర్షాలతో కేంద్రంలో నిల్వ ఉంచిన సుమారు 6 వేల వరి ధాన్యపు బస్తాలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. రైతుల సమస్యలకు మద్దతుగా బీజేపీ నాయకుడు ఎల్లేని సుధాకర్ ఉదయం నుంచే రైతుల పక్షాన నిలబడి అధికారులతో చర్చలు జరిపారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని ఆయన స్పష్టం చేశారు. సుమారు 300 మంది రైతులు ఐకెపి కేంద్రంలో ఆందోళన చేపట్టి, ధాన్యం బస్తాలకు లారీలు ఏర్పాటు చేయాలని ఎమ్మార్వోను డిమాండ్ చేశారు. రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## జవహర్‌లాల్ నెహ్రూకి ఘననివాళి

**ప్రజాపక్షం/మక్తల్ :** భారతదేశ తొలి ప్రధానమంత్రి, ఆధునిక భారత రూపశిల్పి పండిత్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా బుధవారం రోజు మక్తల్ పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులార్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ , కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్ కుమార్, కట్ట సురేష్ గుప్తా, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్కూరి రవి కుమార్, తదితర నాయకులు నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులార్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తొలి ప్రధానమంత్రిగా పనిచేసిన నెహ్రూ... ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి భారత దేశ అభివృద్ధికి నాంది పలికారని అన్నారు. ముఖ్యంగా పేద ప్రజల కోసం అనేక పథకాలు చేపట్టారని గుర్తు చేశారు. నెహ్రూ హయాంలోనే దేశవ్యాప్తంగా అనేక ప్రాజెక్టులు నిర్మించారని, అనేక పారిశ్రామిక సంస్థలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వెంకటేష్, మార్కెట్ డైరెక్టర్ లు ఫయాజ్, శాలం, నాగరాజ్, అంజి, కో ఆప్షన్ మెంబర్ వల్లంపల్లి లక్ష్మ ణ్, నాయకులు వాకిటి శ్యామ్, కావలి రాజేందర్, నీల గౌడ్, శంకర్ నగేష్, గోవర్ధన్, భాస్కర్, యన్‌యస్‌యుఐ అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.



# ఈ దివ్యాంగురాలికి ‘ఇందిరమ్మ’ పథకం అందేనా?



**ప్రజాపక్షం/అలంపూర్ :** దివ్యాంగుల సమాజంలో ఆత్మ గౌరవంతో బతకాలనే ఏకైక లక్ష్యంతో ప్రజాపాలన ప్రభుత్వం పని చేస్తుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. తెలంగాణలో వికలాంగుల పేరుపైనే ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సొంత స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకోవడానికి లేదా స్థలం లేని వారికి ప్రభుత్వ స్థలంతో పాటు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం ఈ పథకం కింద అందజేస్తామని ఆమె హామీ ఇచ్చారు. కానీ నేడు జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన ఓ నిరుపేద మహిళా వికలాంగురాలైన బోయ సరళకు చేదు అనుభవం ఎదురైంది. ఇందరిమ్మ ఇంటి మంజూరు విషయంలో గ్రామపంచాయతీ, మండలపరిషత్ స్థాయి మొదలుకొని జిల్లాస్థాయి ప్రభుత్వ అధికారులు చివరికి జిల్లా కలెక్టర్‌కి గత సంవత్సరం 6వ నెలలో ప్రజావాణిలో వికలాంగురాలినైన తాను ఇందిరమ్మ ఇంటి పథకంలో ఇల్లు మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు. ఇచ్చిన దరఖాస్తుకు ఇప్పటివరకు జిల్లా కలెక్టర్ స్పందన లేకపోవడంతో ఆమె మనస్థాపానికి గురికావడం జరిగింది. జిల్లా కలెక్టర్ నాకు, నా కుటుంబ సభ్యులకు, నా పిల్లలకు తీరని అన్యాయం చేశారు. మరో వైపు ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారని బాధితురాలు, తమ కుటుంబ సభ్యులు నేటి ప్రజాపక్షం దినపత్రిక ముందు తమ కన్నీటి బాధలను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో బాధితురాలి పక్షాన సామాజిక కార్యకర్త శాంతకుమార్, మాజీ నీటి సంఘం అధక్షులు ఎలుక మద్దిలేటి బిసి గ్రామ కార్యకర్త ఉరాకిలి రాజు మాట్లాడుతూ ఈ మహిళకు ఉండటానికి ఇల్లు లేదు గుడిసె లేదు అద్దె గుడిసెలో ఉంటూ ప్రతి నెల ఆమెకు వస్తున్నా పెన్షన్ తో గుడిసె అద్దె 2 వేలు చెల్లిస్తూ దిక్కు తోచని అర్థం కానీ దీన స్థితిలో ఉంటూ చేసేది ఏమి లేక ఆలోచన తోయక అప్పు చేసి కప్పు లెవల్ వరకు ఇంటి నిర్మాణం చేపట్టడం జరిగింది. కావున ఇప్పటి వరకు కట్టిన వాటికి ముందు ఉన్న ఇంటి నిర్మాణం పూర్తి పనుల కొరకు 5 లక్షల రూపాయలను ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చెప్పిన విధంగా ఈ మేరకు పూర్తి బడ్జెట్‌ను మంజూరు చేస్తూ ఈ కుటుంబానికి న్యాయం చేయావల్సిందిగా జిల్లా కలెక్టర్‌ని జిల్లా డిపిఓ, మండల ఎంపీడీవోని కోరుతున్న సపామాజిక కార్యకర్త శాంత కుమార్, మాజీ రైతు సంఘం అధ్యక్షుడు మద్దిలేటి బీసీ కార్యకర్త రాజు, తదితరులు విజ్ఞప్తి చేస్తూ డిమాండ్ చేశారు.

# రైతు ప్రయోజనాలే లక్ష్యం

కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** రైతు ప్రయోజనాల లక్ష్యమని, ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హేమలత కేశవ్ పాటిల్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సివిల్ సప్లై, వ్యవసాయ, రవాణా, రెవెన్యూ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో కలిసి జిల్లాలోని కొనుగోలు పరిస్థితులను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎంతో శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నందున, ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం, హమాలీ, లోడింగ్, రవాణా వంటి అన్ని ప్రక్రియలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే ధాన్యం కొనుగోలు సమయంలో తాలు తరుగు పేరుతో రైతులకు అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారమే తేమ శాతం నాణ్యత అంచనా వేయాలని, అదనపు కోతలు విధించడం లేదా రైతులను అనవసరంగా ఇబ్బందులకు గురి చేయడం సహించలేమన్నారు. ఇటీవల జిల్లాలోని కొన్ని కొనుగోలు కేంద్రాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం ఈ ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతుల నుంచి ఎటువంటి కొనుగోళ్లు నిర్వహించాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ధాన్యం నిల్వలు పేరుకు పోకుండా సమయానికి లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించాలని సూచించారు. అదనపు కలెక్టర్ అమరేందర్ తో పాటు సివిల్ సప్లై, వ్యవసాయ, రవాణా, రెవెన్యూ శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



## జలమయమైన పాఠశాల మైదానం

**ప్రజాపక్షం/అమరచింత :** అకాల భారీ వర్షానికి అమరచింత మున్సిపాలిటీలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ వరద నీటితో జలమయమైంది. బుధవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఉరుములతో, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో పాఠశాలలోని మైదాన ప్రాంతమంతయు వరద నీటితో నిండుకున్నది. ఆ వరద నీరు పోవడానికి ఎలాంటి డ్రైనేజీ వ్యవస్థ లేక ఆ పాఠశాల ఆవరణలో వరద నీరు తటాకంలా కనిపించింది. గురువారం ఆ పాఠశాలలోని వరద నీటిలో పిల్లలు సరదాగా ఈత కొట్టుతూ ఆటలు ఆడారు. వర్షం నీరు చేరుకోవడంతో ప్రతిరోజు ఉదయం సాయంత్రం వాకింగ్ చేసే వాకర్లకు ఇబ్బంది కలిగింది. ఆ వరద నీటిని తొలగించేందుకు శాశ్వతంగా నూతనంగా డ్రైనేజీని నిర్మించి వరద నీరు రాకుండా ఏర్పాటు చేయాలని క్రీడాకారులు కోరారు. పాఠశాల ఆవరణలో వర్షాకాలంలో కూడా వరద నీటితో నిండుకొని ఉంటుందని తెలిపారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం

**ప్రజాపక్షం/పెబ్బేరు :** బూజల సోమమ్మ రంగారెడ్డి మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో పెబ్బేరు మండల పరిధిలోని గుమ్మడం గ్రామంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. శంకర్ నేత్రాలయం చెన్నై, బిఎస్ఆర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో పది రోజుల పాటు ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుమ్మడం గ్రామ కేంద్రంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరం 28 గురువారం నుండి పది రోజుల పాటు నిరంతరాయంగా వైద్య శిబిరం కొనసాగుతుందని బిఎస్ఆర్ సొసైటీ నిర్వహకులు భూజల ఖగేందర్ రెడ్డి తెలియజేశారు.
మొదటి ఏడు రోజుల పాటు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి, ఆపరేషన్లు అవసరం ఉన్నవారికి మొబైల్ ఐ సర్జరీ యూనిట్ ద్వారా కంటిపోర ఆపరేషన్లను మొబైల్ ఆపరేషన్ థియేటర్ల ద్వారా నిర్వహిస్తారు. ఈ ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో పెబ్బేరు, శ్రీరంగాపూర్, వీపనగండ్ల , చిన్నంబావి గ్రామ ప్రజలు ప్రజలే కాకుండా ఎవరైనా సరే తమ ఆధార్ కార్డు ఫోన్ నెంబర్ తో క్యాంపులో వైద్య సేవలను ఉపయోగించుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మెగారెడ్డి, శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, జిల్లా వైద్యాధికారి సాయినాథ్ రెడ్డి, రాజకీయ నాయకులు ఇతరులు పాల్గొంటున్నారు.

# రైతులను విస్మరిస్తున్న ప్రభుత్వం

బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్



**ప్రజాపక్షం/వంగూరు :** తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతాంగాన్ని విస్మరిస్తూ అక్రమలకు పాల్పడుతుందని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన మహా రైతు ధర్నా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు సమస్యలు పట్టించుకోని ముఖ్యమంత్రి ప్రజా పాలన పేరుతో భూదందాలకు తెర లేపుతున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అంటేనే కష్టం అనే విధంగా పరిపాలన కొనసాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన కాదు పోలీస్ పాలన కొనసాగుతుందని ఆయన విమర్శించారు. కేంద్ర సహాయ మంత్రి బిజెపి నాయకుడు బండి సంజయ్ కుమారుని కేసు విషయంలో ముఖ్యమంత్రి ఆడుతున్న నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్ రెడ్డి, జైపాల్ యాదవ్ లు మాట్లాడుతూ అవినీతిపరుల కు అక్రమార్కుల కు రేవంత్ రెడ్డి కొమ్ము కాస్తున్నారని వారు మండపడ్డారు. ఈ సందర్భంగా ర్యాలీతో బయలుదేరి తహసిల్దార్ కు వినతి పత్రం అని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకలు గోలి శ్రీనివాస్ రెడ్డి, పోకల మనోహర్, కొమ్ము శ్రీనివాస్ యాదవ్, తులసి రామ్, శ్రీకాంత్ భీమా, వినపల్లి గణేష్ రావు, నరేందర్ రావు, పుల్లయ్య యాదవ్, రాజేందర్ రెడ్డి, అంకు సురేందర్, ఎల్లా గౌడ్, నారాయణ రావు, మదన్ కుమార్ రెడ్డి, సర్పంచులు శ్రీపతి రావు, గోపి రెడ్డి లక్ష్మ మ్మ, రామ్ భీష్మ నరసింహారెడ్డి, ఆయా గ్రామాల పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ శాఖలన్నింటిపై పట్టు సాధించాలి

ట్రైనీ కలెక్టర్ల శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ, అదనపు కలెక్టర్లు

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** పరిపాలనపై అవగాహన కలిగించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలపై శిక్షణా కలెక్టర్లు పట్టు సాధించాల్సిన అవసరం ఉందని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం శిక్షణ కలెక్టర్లు ఎత్తబోయిన సాయి శివాని మహబూబ్‌నగర్ సచిన్ బసవరాజ్ గుత్తూరు(వికారాబాద్), నేలటూరు శ్రీకాంత్ రెడ్డి (నల్లగొండ), పోతురాజు హరిప్రసాద్ (కరీంనగర్), పరాసు కుమార్(ఖమ్మం) సురేష్ పామూరి(నిజాంబాద్) జోగులాంబ గద్వాల జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు అదనపు కలెక్టర్లతో కలిసి జిల్లా పరిపాలనపై ట్రైనీ కలెక్టర్లకు అవగాహన కలిగించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా విత్తన పత్తి పంటకు ప్రసిద్ధి చెందిందని, కాబట్టి ఈ ప్రాంతం సీడ్ క్యాపిటల్ ఆఫ్ తెలంగాణగా పేరు పొందిందన్నారు. ప్రస్తుతం జోగులాంబ గద్వాల జిల్లాగా ఆవిర్భావం తర్వాత అనేక రంగాల్లో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. అక్షరాస్యతలో గట్టు మండలం వెనుకబడడంతో ఆ ప్రాంత అభివృద్ధికి జిల్లా అధికారి యంత్రాంగం కృషి చేస్తోందని వివరించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి ఆయా శాఖలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తూ ప్రజల నమ్మకాన్ని చురగొనాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా జిల్లాలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలను గురించి ఎస్పీ వివరించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ మధు మోహన్ మాట్లాడుతూ ట్రైనీ కలెక్టర్లు తమ జిల్లాలోని వివిధ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై తరచు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ఉండాలన్నారు. జిల్లా పరిస్థితులపై సంపూర్ణంగా అవగాహన కలిగి ఉంటే ఎలాంటి ఒత్తిడిలు ఎదురైనా సమన్వయంతో ఎదుర్కొంటు జిల్లా పరిపాలన కొనసాగించాలన్నారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు నర్సింగరావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేస్తోందని, కేంద్రాల వద్ద కొనుగోలు ప్రక్రియ గురించి వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ వర్తింపజేసేందుకు సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. ప్రజలకు కనీస మౌలిక వసతులను వంద శాతం కల్పిస్తూ, ఎలాంటి సమస్యలు వచ్చిన పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ట్రైనీ కలెక్టర్లు జిల్లాలో నేరాల పరిస్థితి, ఇతర అంశాలపై అడగగా జిల్లా అధికారులు వాటి గురించి తెలియజేశారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాసరావు, పలు శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## 'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి

ఎంపిడిఒ రాధారాణి



**ప్రజాపక్షం/యాచారం:** ఉపాధి పనిని ప్రతి కూలీ సద్వినియోగం చేసుకోవాలని యాచారం ఎంపిడిఒ రాధారాణి అన్నారు. బుధవారం యాచారం మండల పరిధిలోని నల్లవేల్లి గ్రామంలో ఉపాధి పనులను గ్రామంలో వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సంధర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వ నిభంధనల ప్రకారం పనులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాల్సిన భాద్యత మనపై ఉందన్నారు. సకాలంలో కూలీ డబ్బులు చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గ్రామంలో వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



**ప్రజాపక్షం/యాచారం :** సమాజంలో మహిళలు రాజకీయంగా, అర్థికంగా అన్నిరంగాల్లో రాణించాలని యాచారం ఎంపిడిఒ రాధారాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎంపిడిఒ రాధారాణి, రంగారెడ్డి జిల్లా అడిషినల్ డిఅర్‌డిఎ జోజప్ప మాట్లాడుతూ సెర్ఫ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఇందిరా మహిళా శక్తి చీరలు అర్హులైన వారందరికి అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెరటి కోళ్ళ పెంపకం, రామ్ ల్యాబ్ గొర్రె పోటేళ్ళ పెంపకం గురించి చర్చించారు. కార్యక్రమంలో ఐకెపి ఎంపిఎం రవీందర్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ సరళ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రేమలత, కోషాదికారి ఈశ్వరమ్మ, మండలంలోని గ్రామ సంఘాల అధ్యక్షురాళ్ళు, సిసిలు, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.


## నందివనపర్తి రోడ్డును బిటిగా మార్చాలి



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల కేంద్రం నుండి అంబేద్కర్ చౌరస్తా నుండి నందివనపర్తి గ్రామానికి వెళ్ళే ప్రధాన రహదారిని బిటి రోడ్డుగా మార్చాలని బిఅర్ఎస్ యాచారం మండల యూత్ అధ్యక్షులు మహ్మద్ జాని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో అయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్డును పూర్తిచేయాలని కోరుతూ గతంలో ఎంఎల్ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపిడిఒ రాధరాణికి పలుమార్లు ఫిర్యాదు చేసిన, పనులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. చినుకు పడితే రోడ్డంతా గుంతలమయంగా మారుతుందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డును బిటి రోడ్డుగా మార్చక పోతే కాలనీవాసులతో కలిసి అందోళన చేస్తామని హెచ్చరించారు.

## తాడిపర్తి గ్రామాభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేయడానికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యేను గ్రామ కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు నీలం రాములు, మదర్ డయిరీ డైరెక్టర్ మండల జంగయ్య కలిసి గ్రామ సమస్యలను వివరించారు. టిజి ఐఐసి ద్వారా గ్రామంలో అవసరమైన సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ ఏర్పాటుతో బాటు వివిధ అభివృద్ధి పనులను చేయిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు వినోద్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, వార్డుమెంబర్ దశరథ, నీలం లక్ష్మమ్మ, పాండు, యాచారం మమత, ఎండి యూసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నిపుణులను అందించడానికి ఇఎస్‌సిఐతో ఒప్పందం

నారెడ్కో తెలంగాణ అధ్యక్షుడు కొప్పుల శ్రీధర్‌రెడ్డి



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** నిర్మాణ, మౌలిక సదుపాయాల రంగాలకు అవసరమైన నిపుణులను, ప్రతిభావంతులను అందించడానికి ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇఎస్‌సిఐ)తో నారెడ్కో తెలంగాణ ఎంఒయు ఒప్పందం చేసుకుందని (నారెడ్కో తెలంగాణ) నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ తెలంగాణ అధ్యక్షులు కొప్పుల శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం గచ్చిబౌలిలోని ఇఎస్‌సిఐలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగ నిపుణుల కోసం ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, పరిశ్రమ సాంకేతిక నైపుణ్య అబివృద్ధి కార్యక్రమాలను తీర్చిదిద్దడానికి నిపుణులను తీర్చిదిద్ది హైదరాబాద్ నగర అభివృద్ధికి మద్దతు ఇవ్వాలనే సంకల్పంతో నారెడ్కో ఇఎస్‌సిఐతో ఎంఒయు ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు.

# ఒక్క వర్షంతోనే ఆగమాగం

## 263 ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** వర్షాకాలం ప్రారంభం కానే లేదు. అప్పుడే టిజిఎస్‌పిడిసిఎల్ డొల్లతనం తేలిపోయింది. మంగళవారం అర్ధరాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికే 263 ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో వినియోగదారులతో పాటు విద్యుత్ అధికారులు ఆందోళనకు గురయ్యారు. వర్షానికి ఈదురు గాలులు తోడవ్వడంతో క్యూర్ ప్రాంతవాసులు ఆగమాగం అయ్యారు. గ్రేటర్ పరిధిలోని 11 కేవీకి చెందిన 263 ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. 214 ఫీడర్లలో గంట వ్యవధిలోపే విద్యుత్ పునరుద్ధరించగా, మరో 49 ఫీడర్లలో విద్యుత్ పునరుద్ధరణకు రెండు నుంచి ఐదు గంటల సమయం పట్టింది. గ్రేటర్ పరిధిలో 39 డీటీఆర్లు ఫెయిలయ్యాయి. 20 నుంచి 25 విద్యుత్ స్థంభాలు విరిగిపడ్డాయి. ఇనుమ విద్యుత్ స్తంభాలు సైతం వంగిపోయాయి. బలమైన ఈదురు గాలిలో కూడా విద్యుత్ సిబ్బంది రాత్రి 11 గంటల నుంచి తెల్లవారు జాము నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాను పూర్తిగా పునరుద్ధరించారు. వర్షంతో పాటు బలంగా వీచిన ఈదురు గాలులతో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ స్థంభాలపై, విద్యుత్ తీగలపై పడడంతో డిస్కులు, ఇన్సులేటర్లు పగిలిపోయాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మేడ్చల్ జిల్లాలో 11 కేవీకి చెందిన 53 ఫీడర్లలో సైబర్సిటీ సర్కిల్ పరిధిలో 11 కేవీకి చెందిన 57 ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలో 11 కేవీకి చెందిన 17 ఫీడర్లలో



విద్యుత్ సరఫరాకు అంతరాయం కాగా, సెంట్రల్ సర్కిల్ పరిధిలో 51కి పైగా ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సికింద్రాబాద్ సర్కిల్లో 20 ఫీడర్లలో, హైదరాబాద్ సర్కిల్లో 65 ఫీడర్లలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి రాత్రి 11 గంటల నుంచే విద్యుత్ పునరుద్ధరణ పనులను చేపట్టారు. తక్కువ తీవ్రత ఉన్న ప్రాంతాలలో రెండు నుంచి మూడు గంటల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగా, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్న ప్రాంతాలలో, విద్యుత్ తీగలు తెగి పడిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా పనులు కొంత ఆలస్యం అయ్యాయి. తెల్లవారు జాము నాలుగు గంటల వరకు అన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఒకటి రెండు చోట్ల విరిగిన విద్యుత్ స్థంభాల స్థానంలో కొత్తవి యుద్ధ ప్రతిపాదికన పునరుద్ధరించారు. ఎండల తీవ్రత పెరగడంతో వేడి, ఉక్కపోత పెరిగింది. దోమల బెడద కూడా ఉండడం, అకాల వర్షంతో ఏర్పడిన విద్యుత్ అంతరాయంతో జనాలు రాత్రి పూట జాగరణ చేయాల్సి వచ్చింది. పిల్లలు ఉక్కపోతకు కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అకాల వర్షాల నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎండీ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు.

### స్తంభం కూలి కార్లు ధ్వంసం

**జూబ్లీహిల్స్:** ఈదురుగాలుకు కూలిన స్తంభంతో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షం, ఈదురుగాలులకు ఏజీ కాలనీ సమీపంలోని వికాస్‌పురిలో ఒకింత విధ్వంసం చోటుచేసుకుంది. అర్ధ రాత్రి సమయంలో ఒక్కసారిగా గాలి వేగం పెరగడంతో రోడ్డుపక్కన ఉన్న కరెంట్ పోల్ కూలిపోయి అక్కడ పార్క్ చేసి ఉన్న కార్లపై పడింది. ఘటన సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మత్తు పనులు చేపట్టారు.



### బిసి విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్న

## జిఓ నెంబర్7 రద్దు చేయాలి



టిపిసిసి అధ్యక్షుడు

మహేష్ కుమార్ గౌడ్‌కు వినతి

ప్రైవేటు యూనివర్సిటీలలో విద్యార్థులకు

రిజర్వేషన్లు అమలు చేయాలి : విక్రమ్ గౌడ్


**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్న జిఓ ఎంఎస్ నెంబర్7ను వెంటనే రద్దు చేయాలని బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాడికొండ విక్రమ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇంజనీరింగ్ విద్యలో బిసి విద్యార్థులకు అమలు చేస్తున్న 10 వేల ర్యాంకు నిబంధన వల్ల వేలాది మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను విద్యార్థుల ఖాతాల్లో జమ చేసే విధానం కారణంగా కళాశాలలు ముందుగానే పూర్తి ఫీజులు వసూలు చేస్తున్నాయని, పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు యూనివర్సిటీలలో కూడా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి జెఎసి అధ్యక్షుడు వేముల రామకృష్ణ, బిసి విద్యార్థి సంఘం జనరల్ సెక్రటరీ నాగరాజు గౌడ్, బిసి రక్షక దళ్ చైర్మన్ ఉదయ్ నేత, బిసి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ మేరు, సురేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### హక్కుల పరిరక్షణకు

## ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించండి

ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకుడు, టిజెఇయు అధ్యక్ష అభ్యర్థి మొగుళ్ళ రాజిరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** జలమండలి ఉద్యోగ, కార్మికుల భద్రత, సంక్షేమం కోసం పాటుపడే, హక్కులను పరిరక్షించడానికి దోహదపడే తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించాలని ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, టిజెఇయు అధ్యక్ష అభ్యర్థి మొగుళ్ళ రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు. గండిపేట్ డివిజనల్ కార్యాలయంలో బుధవారం జలమండలి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల ప్రచారంను రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహా రెడ్డితో కలిసి మొగుళ్ళ రాజిరెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలమండలి కార్మికులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, పదోన్నతులు, ఉద్యోగ భద్రత కోసం నిరంతరం పోరాడతామని తెలిపారు. జూన్ 6 న జరిగే జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ త్రిశూలం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించి కార్మికుల గళాన్ని మరింత బలంగా వినిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డి చంద్రశేఖర్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షులు కె.రాజ్‌రెడ్డి, టిజెఎంఈయు ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్, నేతలు ఈ.చంద్రశేఖర్, సయ్యిద్ అక్తర్ అలీ తదితరులు పాల్గొన్నారు.




## పంట అవశేషాలను కాల్చొద్దు

రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి డి ఉష



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రైతులు పంట అవశేషాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉష సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆమె హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగుమందుల ప్రభావం తగ్గిపోతుందని మంత్రి తెలిపారు. అందువల్ల పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. రైతు సోదరులు పంట కోత పూర్తయ్యాక పొలంలో మిగిలిపోయే వరి గడ్డి, మొక్కజొన్న కాడలు, పత్తి కాండాలు వంటి పంట అవశేషాలను కాల్చివేయడాన్ని స్టబుల్ బర్నింగ్ అంటారన్నారు. దీని వలన నేల సారవంతం తగ్గుతుందని చెప్పారు. అంతే కాకుండా నేలలో ఉన్న సేంద్రియ పదార్థం, సూక్ష్మజీవులు నశిస్తాయి. గాలి కాలుష్యం పెరుగుతుంది. పొగ వల్ల శ్వాస సంబంధ సమస్యలు వస్తాయని తెలిపారు. 2017 జులై 10న తీసుకువచ్చిన జిఒ నెంబర్ 27 ప్రకారం ఎవరైనా పంట కోత తర్వాత చెత్త/పంట అవశేషాల దహనం చేసినట్లయితే ఇపి యాక్ట్ 1986 సెక్షన్ 3,6 అండ్ 25 ప్రకారం రూపాయలు రూ.5000 నుండి రూ.25000 వరకు జరిమానా విధించబడుతుందని డిఎఒ ఉష హెచ్చరించారు.

## ధాన్యం తరలించేందుకు వాహనాలు సిద్ధం చేయాలి

కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వాహనాలను సిద్ధం చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సినారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలు సంభవించడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉత్పన్నమయిన పరిణామాలను సమీక్షించేందుకు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అత్యవసరంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తోపాటు మంత్రివర్గ సహచరులు, పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫన్ రవీంద్ర, రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లు, పోలీస్, రవాణా, పౌర సరఫరాల శాఖాధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ నారాయణ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు పంపేందుకు వాహనాలను సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మిల్లర్లు మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేసుకోవాలని సూచించారు. మిల్లర్లు ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేసుకోనట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ధాన్యా న్ని తరలించేందుకు అవసరమైన వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని, ధాన్యాన్ని తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్దేశించిన సమయంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, జె హరీష్, వ్యవసాయశాఖ అధికారి ఉష, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి ఎల్.శ్రీలత, ట్రాన్స్పోర్ట్ అధికారి సదానందం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పని ప్రదేశంలో మహిళల రక్షణకు చట్టాలు

రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్

డాక్టర్ కిరణ్మయి






**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పని ప్రదేశంలో మహిళల రక్షణకు పోష్ చట్టం 2013 భద్రత కల్పిస్తుందని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి తెలిపారు. బుధవారం ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళ శిశు వికలాంగుల, వయోవృద్ధుల శాఖ జిల్లా సంక్షేమ అధికారి ఎల్.శ్రీలత ఆధ్వర్యంలో మహిళా వారోత్సవాలలో భాగంగా పోష్ యాక్ట్ పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోష్ యాక్ట్ మహిళలకు పని ప్రదేశాలలో భద్రతను రక్షణను కల్పిస్తుందని, వేధింపులకు గురి అయిన మహిళలు ఈ చట్టం ద్వారా న్యాయం పొందవచ్చు అని చెప్పారు. ఎన్‌జిఒ సభ్యురాలు పద్మావతి పోషణ చట్టంపై అవగాహన కల్పిస్తూ, ఈ చట్టం రావడానికి కారణాలను వివరించారు. పని ప్రదేశంలో మహిళలకు ఈ పోష్ చట్టం ఎలా పనిచేస్తుంది అనే దానిపైన అవగాహన కల్పించారు. లోక్ అదాలత్ సభ్యురాలు అమిత రాణి మాట్లాడుతూ పోష్ చట్టంలో మహిళల భద్రత గురించి వివరించారు. కంపెనీలలో మహిళలకు లైంగిక వేదింపులు జరిగినపుడు దైర్యంగా ఐసి(ఇంటర్నల్ కమిటీ)లో ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించుకోవచ్చు అని వివరించారు. డాక్టర్ సిరి ప్రీతి మాట్లాడుతూ ప్రతి ప్రైవేట్, ప్రభుత్వ కంపెనీలలో ఇంటర్నల్ కమిటీని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. యజమాని, ఉద్యోగి వలన పని ప్రదేశాలలో లైంగిక వేదింపులు జరిగినట్లు అయితే ఎలా ఫిర్యాదు చేయాలి, ఇంటర్నల్ కమిటీ, లోకల్ కమిటీ గురించి అవగాహన కల్పించారు. హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యాదగిరి పోష్ చట్టం గురించి, న్యాయ సలహాలు, కోర్టులో పోష్ యాక్ట్ ద్వారా వచ్చిన కేసులను ఉదాహరణగా వివరించారు. రంగారెడ్డి జిల్లాలో ఉన్న పలు ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలలో నుంచి యజమాన్యం, ఉద్యోగులు ఈ అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ శారదదేవి, అగ్రికల్చర్ అధికారి డి.ఉష, డిపిఒ వి.సురేష్ మోహన్, ఎస్‌సి కార్పొరేషన్ డిడి జొన్నలగడ్డ పద్మావతి, అడాల్ట్ ఎడ్యుకేషన్ డిడి అనిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
గురువారం
28-05-2026
www.prajapaksham.in
STATE & REGIONAL NEWS
జనరల్
STATE & REGIONAL NEWS

# ఆలయాల నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతిపై కఠిన చర్యలు



## దేవాలయాలపై భక్తులకు నమ్మకం మరింత పెరగాలి

### మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని దేవాలయాలు భక్తుల విశ్వాసాలకు ప్రతీకగా నిలవాలని, ఆలయాల నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం, అవినీతికి ఎలాంటి అవకాశం ఉండకూడదని తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. భక్తుల్లో దేవాలయాల పట్ల నమ్మకం మరింత బలపడేలా సేవలు, నిర్వహణ, పారదర్శకతను పెంచాలని సూచించారు. బంజారాహిల్స్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో దేవాదాయ శాఖకు సంబంధించి ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా వేదికల్లో వచ్చిన ప్రతికూల వార్తలు, ప్రజాభిప్రాయాలపై మంత్రి సురేఖ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల నిర్వహణ, భక్తులకు అందుతున్న సేవలు, దేవాలయ ఆస్తుల పరిరక్షణ, ఆదాయ వినియోగం, సిబ్బంది పనితీరు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర దేవాదాయ శాఖను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కోట్ల రూపాయల నిధులతో ఆలయాల అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతి అధికారి అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. మీడియాలో వచ్చిన కథనాలను నిర్లక్ష్యం చేయకుండా వాటిని సమీక్షించి ఎక్కడ లోపాలు ఉన్నా వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవల నాణ్యత పెంచడం, ప్రసాదాల నాణ్యత, పరిశుభ్రత, భద్రత, సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.దేవాదాయ శాఖపై ప్రజల్లో సానుకూల భావన పెరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. దేవాలయాల నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో విధుల పట్ల నిర్లక్ష్యం కారణంగా ఫిర్యాదులు రావడంతో స్వయంగా తనిఖీ చేసి పలువురు ఉద్యోగులపై చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న సరస్వతీ అంత్య పుష్కరాల ఏర్పాట్లపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఘాట్ల పరిశుభ్రత, భద్రత, తాగునీరు, వైద్య సేవలు, పార్కింగ్, రవాణా ఏర్పాట్లను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. సరస్వతీ అంత్య పుష్కరాలు ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచేలా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## బిజెపి ద్రవ్యోల్బణ మంటకు ప్రజలకు చెమటలు

### ప్రధాని సూచనలపై ఖర్గే ఫైర్

**న్యూఢిల్లీ :** ఎండే మండలకు తగినంత నీరు తీసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు నీటిని తీసుకెళ్లాలని ప్రధాని మోడీ దేశ పౌరులకు జాగ్రత్తలు, సూచనలు చెప్పారు. ప్రధాని పౌరులకిచ్చిన సూచనలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికర్జున ఖర్గే ఫైర్ అయ్యారు. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వం కేవలం ప్రజా సంక్షేమం గురించే మాట్లాడుతుంది తప్ప.. ద్రవ్యోల్బణం గురించి మాట్లాడదు.. మౌనం వహిస్తుంది అని ఖర్గే విమర్శించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టులో చేశారు. కాగా, 'మేము వేడిని తట్టుకోగలం, కానీ బిజెపి ప్రాయోజిత ద్రవ్యోల్బణం అనే మంటకు సామాన్య ప్రజలు చెమటలు పడుతున్నాయి. మీ సొంత ప్రభుత్వం చేస్తున్న దోపిడీ గురించి మీరెప్పుడూ మాట్లాడరా.. మోడీ గారూ?' అని ఖర్గే ఎక్స్ పోస్టులో ప్రధానిని ప్రశ్నించారు.

## ఎండలో బయటకు వెళ్లొద్దు

### ప్రధాని నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. అనేక రాష్ట్రాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు కొన్ని సూచనలు చేశారు. నీరు ఎక్కువగా తాగాలని.. వీలైనంతవరకు మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లొద్దని పేర్కొన్నారు. అతి తీవ్రమైన వాతావరణ పరిస్థితుల నుంచి తమను తాము కాపాడుకోవాలని, వద్ధులను గమనిస్తూ ఉండాలని సూచించారు. వీలయితే ఇతరులకు కూడా సాయం చేయాలని, ఇళ్లు, దుకాణాల బయట పక్షులు, జంతువుల కోసం నీటిని ఉంచాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తల తిరగడం, వికారం, అలసట వంటి వడదెబ్బ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దని మోదీ ప్రజలకు సూచించారు.

## త్యాగానికి, దాన గుణానికి ప్రతీక బక్రీద్ : కెసిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** త్యాగానికి, దాన గుణానికి ప్రతీకగా, విశ్వవ్యాప్తంగా ఇస్లాం ఆరాధకులు జరుపుకునే పర్వదినం బక్రీద్ పండుగ అని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు అన్నారు. బక్రీద్ (ఈద్‌ఉల్ అజ్హా ) పవిత్ర దినం సందర్భంగా ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ధనవంతులు పేదలు అనే ఎటువంటి బేధాలు లేకుండా, ప్రజల నడుమ శాంతి, సహనం సౌభ్రాతృత్వాన్ని బక్రీద్ పండుగ పెంపొందిస్తుందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దినాన, ధార్మికత, దైవచింతన ప్రతి మానవుడి హృదయంలో విరజిమ్మాలని ఆయన ఆకాంక్షించారు.

## జియో నుంచి సరికొత్త రూ.200 ఓటిటి పాస్

**28-రోజుల ప్యాక్‌లో 15 ప్రీమియం ఓటిటిలు, 1,000కి పైగా లైవ్ టివి ఛానెల్స్, 30 జిబి డేటా, అపరిమిత 5జి**

**హైదరాబాద్ :** జియో తాజాగా సరికొత్త రూ.200 'జియో ఓటిటి పాస్'ను పరిచయం చేసింది. ఇది ఒక 28రోజుల ప్యాక్‌గా 15 ప్రీమియం ఓటిటి యాప్‌ల యాక్సెస్, జియో టివిలో 1,000కిపైగా లైవ్ టివి ఛానెల్స్, 30 జిబి హైస్పీడ్ డేటా, వినియోగదారుడి బేస్ ప్లాన్ చెల్లుబాటు కాలం వరకూఅపరిమిత 5జిను అందిస్తుంది. ఈ కొత్త పాస్ బుధవారం (2026 మే 27 స్వతంత్ర ఎంటర్‌టైన్‌మెంట్ ఆఫర్‌గా రూపొందించిన ఈ కొత్త రూ.200 జియో ఓటిటి పాస్ వీడియో స్ట్రీమింగ్, లైవ్ టెలివిజన్, హైస్పీడ్ కనెక్టివిటీని ఒకే స్థిర ధర ప్యాక్‌లో అందిస్తుంది. దీని ద్వారా వినియోగదారులు కేవలం రూ.200కే నెలకు సుమారు రూ.1,500 విలువైన ప్రయోజనాలను పొందవచ్చు.ఈ పాస్‌లో ఒకే ప్యాక్‌లో 15 ప్రీమియం ఓటిటి ప్లాట్‌ఫారమ్‌ల సభ్యత్వాలు ఉంటాయి. వినియోగదారులు టివి, టాబ్లెట్, మొబైల్ పరికరాల్లో ప్రకటనలు లేకుండా వీక్షణ, బ్యాక్‌గ్రౌండ్ ప్లే, ఆఫ్‌లైన్ డౌన్‌లోడ్స్‌తో యూట్యూబ్ ప్రీమియం యాక్సెస్ పొందుతారు. సబ్‌స్క్రైబర్లు జియో టివిలో 1,000కు పైగా లైవ్ టివి ఛానెల్స్‌కు కూడా యాక్సెస్ పొందుతారు. వీటిలో ప్రముఖ బ్రాడ్‌కాస్టర్లకు చెందిన 150కు పైగా పెయిడ్ ఛానెల్స్ ఉన్నాయి. కనెక్టివిటీ పరంగా,రూ.200 జియో ఓటిటిపాస్ 30 జిబి హైస్పీడ్ 4జి/5జి డేటాతో పాటు అపరిమిత 5జి యాక్సెస్‌ను అందిస్తుంది. ఇది వినియోగదారుడి యాక్టివ్ బేస్ ప్లాన్‌తో సమకాలికంగా ఉండి, గరిష్ఠంగా 28 రోజులు చెల్లుబాటు అవుతుంది. ఈ పాస్‌ను యాక్టివేట్ చేసుకోవడానికి వినియోగదారులు తప్పనిసరిగా యాక్టివ్ బేస్ ప్లాన్ కలిగి ఉండాలి.

## ఫేక్ ఆన్‌లైన్ షాపింగ్ ప్రకటనలతో పెరుగుతున్న మోసాలు

### జాగ్రత్తగా కొనుగోళ్లు చేయాలి: తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సోషల్ మీడియాలో కనిపించే భారీ డిస్కౌంట్లు, తక్కువ ధరల పేరుతో జరుగుతున్న ఆన్‌లైన్ షాపింగ్ మోసాలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ప్రజలను అప్రమత్తం చేసింది. ప్రముఖ బ్రాండ్ల పేర్లతో నకిలీ ప్రకటనలు సృష్టించి వినియోగదారులను మోసం చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయని హెచ్చరించింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్ బుధవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో పలు సోషల్ మీడియా వేదికల్లో నకిలీ స్పాన్సర్డ్ ప్రకటనలు పెరుగుతున్నాయని తెలిపారు. సైబర్ నేరగాళ్లు బ్రాండెడ్‌షూస్, ఎలక్ట్రానిక్ వస్తువులు, దుస్తులు, గాడ్జెట్లు, బీమా ఉత్పత్తులు, లగ్జరీ వస్తువులను అసాధారణంగా తక్కువ ధరలకు అందిస్తున్నట్లు ప్రచారం చేస్తూ నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ పేమెంట్ గేట్‌వేలకు వినియోగదారులను మళ్లిస్తున్నారని వెల్లడించారు. చాలాసార్లు డబ్బులు చెల్లించిన తర్వాత వస్తువులు అందకపోవడం, మరి కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఆర్థిక సమాచారం దొంగిలించబడుతున్నట్లు తెలిపారు.అసాధారణ తగ్గింపు ధరలు, ఫ్లాష్ సేల్స్,క్యాష్ ఆన్ డెలివరీ అవకాశం లేకపోవడం, కొత్తగా ప్రారంభమైన సోషల్ మీడియా పేజీలు, అనుమానాస్పద వెబ్‌సైట్ లింకులు, నాసిరకం డిజైన్,,నకిలీ రివ్యూలు, ఎడిట్ చేసిన స్క్రీన్‌షాట్లు, ముందుగానే చెల్లింపు చేయాలని ఒత్తిడి చేస్తారని శిఖా గోయల్ తెలిపారు. వెబ్‌సైట్ అడ్రస్‌ను జాగ్రత్తగా పరిశీలించడం, అధికారిక బ్రాండ్ వెబ్‌సైట్లలో ధరలు పోల్చి చూడడం, తెలియని స్పాన్సర్డ్ ప్రకటనలపై క్లిక్ చేయకుండా ఉండడం, సురక్షితమైన చెల్లింపు విధానాలు మాత్రమే వినియోగించడం, ఒటిపిలు లేదా బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు. మోసానికి గురైనట్లు అనుమానం వచ్చిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని తెలిపారు.

## మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలి : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అకాల వర్షాలతో ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులను, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని బిఆర్‌ఎస్ శ్రేణులను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు పిలుపునిచ్చారు. తేమ శాతం, తరుగు లాంటి ఎలాంటి సాకులు చెప్పకుండా మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి,మొక్కజొన్న తదితర ధాన్యాంను బేషరతుగా కనీస మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి,వారిని ఆదుకోవాలని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని,ఇలాంటి తరుణంలో రైతులకు అండగా నిలువాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్క జొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రిజిస్ట్రేషన్ కార్యాలయాల పనివేళల పెంపు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద రద్దీ పెరిగిన నేపథ్యంలో ఈ నెల 29వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పనివేళలను ఉదయం 9:30 గంటల నుంచి రాత్రి 7:30 గంటల ప్రభుత్వం పెంచింది. రాష్ట్రంలో భూముల విలువలను వాస్తవ మార్కెట్ ధరలకు అనుగుణంగా క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయించడంతో రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపట్టింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల పని వేళలను పొడిగిస్తున్నట్టు రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రకటించారు.



## అక్రమంగా ప్రజా రవాణా చేస్తున్న ఇతర రాష్ట్ర టాక్సీ వాహనాలపై చర్యలు

### టిజిపిడబ్ల్యుయు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అక్రమంగా ప్రజా రవాణా చేస్తున్న ఇతర రాష్ట్ర టాక్సీ వాహనాలపై తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు క్యాబ్ ధరల సవరణ కోరుతూ జూన్ మొదటి వారంలో రాష్ట్రవ్యాప్త 'బ్రేక్‌డౌన్ స్ట్రైక్' చేపట్టనున్నట్లు టిజిపిడబ్ల్యుయు ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం జెటిసి ఎం. చంద్రశేఖర్ గౌడ్, అదనపు కార్మిక కమిషనర్ ఇ. గంగాధర్‌ని కలిసి సంబంధిత వినతి పత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని ఓలా, ఉబెర్, రాపిడో వంటి యాప్ ఆధారిత ప్లాట్‌ఫామ్‌లలో పనిచేస్తున్న క్యాబ్ డ్రైవర్లు నిరంతరం పెరుగుతున్న ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు, పెరిగిన జీవన వ్యయం కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యలపై తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందని తెలిపారు.

**సమ్మె హెచ్చరిక:** యాజమాన్యాలు, రవాణా, కార్మిక శాఖలు స్పందించి ఈ సమస్యలను జూన్ మొదటి వారం లోపు పరిష్కరించాలని యూనియన్ డిమాండ్ చేసింది. లేకపోతే తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఓలా, ఉబెర్, రాపిడో డ్రైవర్లందరితో కలిసి రాష్ట్రవ్యాప్త బ్రేక్‌డౌన్ స్ట్రైక్ (మహా సమ్మె) చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు.

## త్యాగం,సేవాభావం, మానవతా విలువలకు ప్రతీక బక్రీద్ : మంత్రి పొన్నం

**ప్రజాపక్షం / సిటీ బ్యూరో :** త్యాగం, సేవాభావం, మానవతా విలువలకు ప్రతీక బక్రీద్ పర్వదినమని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బక్రీద్ పండగను పురస్కరించుకుని ముస్లిం సోదరసోదమణులకు ఆయన పండగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండగ సమాజంలో సోదరభావం, పరస్పర గౌరవాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు శాంతి,సామరస్య వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## బంగ్లాదేశ్ ప్రధానమంత్రి రెహ్మాన్ వందరోజుల పాలనపై మిశ్రమ స్పందన

**ఢాకా:** బంగ్లాదేశ్ ప్రధానమంత్రి తారిఖ్ రెహ్మాన్ పదవీ బాధ్యతలు తీసుకుని 100 రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయన పాలనపై మిశ్రమ స్పందనలు వెలువడుతున్నాయి. ఆయన బాధ్యతలు చేపట్టిన 11 రోజులకే పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభం కావడంతో దేశంలో చమురు సంక్షోభం మొదలైంది. ఈ ప్రాంతీయ సంఘర్షణ వల్ల ప్రపంచ మార్కెట్లలో అస్థిరత్వం వచ్చింది. బంగ్లాదేశ్‌లో చమురు ధరలు పెంచిన తర్వాత కొంత రెవెన్యూ స్థిరత్వం వచ్చినప్పటికీ, ద్రవ్యోల్బణం సమస్య తలెత్తింది. ప్రతిపక్షాల నాయకుల ఇళ్ళకు వెళ్ళి వారితో సమావేశాలే నిర్వహించడం, విద్యాలయాలలో ఆహార పథకాన్ని పునఃప్రారంభించడం, పాఠ్య ప్రణాళికల సవరణ, నాలుగో తరగతి నుండే క్రీడలను అనివార్యం చేయడం, ప్రతిపక్షాలను ప్రతి విషయంలోనూ జోక్యం చేసుకునే చర్యలు తీసుకోవడంతో ఆయనపై కొంత సానుకూల వాతావరణం ఏర్పడింది. అదే సమయంలో విశ్వవిద్యాలయాలలో నియామకాలు ఆయనపై దుమారం రేపాయి.



## జలమండలి ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతా

### మొగుళ్ళ రాజిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జలమండలి ఉద్యోగులు, కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పిస్తామని ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి హామీ ఇచ్చారు. జూన్ 6 న జరిగే జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో త్రిశూలం గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని విఎస్‌టి ఫంక్షన్ హాల్‌లో బుధవారం దాదాపు 800 మంది జలమండలి పర్సనల్ అడ్మినిస్ట్రేషన్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగాల ఉద్యోగులు సమావేశమై ఐఎన్‌టియుసి అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌కు ఐక్యతతో మద్దతు తెలిపి మొగుళ్ళ రాజి రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారమే నా మొదటి ప్రాధాన్యత అని, ప్రతి ఉద్యోగి గౌరవం, హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతానని, ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జలమండలిలో బలమైన నాయకత్వాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షులు కె.రాజ్‌రెడ్డి, టిజెఎంఇయు ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్ , ఇ.చంద్రశేఖర్, బి. మహేష్, సయ్యద్ అక్తర్ అలీ, కె.ఆనంద్ రెడ్డి, బి.శంకర్ ప్రకాష్, బి.నర్సింగ్ రావు, వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీ డిక్రీని కోర్టులు తెరవలేవు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిజాం నవాబు వారసత్వ ఆస్తుల వివాదానికి సంబంధించిన 1959 రాజీ డిక్రీని 67 ఏళ్ల తర్వాత మళ్లీ తెరవలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. సాలార్జంగ్3 వారసులమంటూ తమను ప్రతివాదులుగా చేర్చాలన్న ఇద్దరు మహిళల పిటిషన్‌ను తిరస్కరించింది. సమానా ఫాతిమా, జైనబ్ ఫాతిమా అనే మహిళలు 1958లో ప్రారంభమైన సివిల్ సూట్‌లో తమను ప్రతివాదులుగా చేర్చాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్‌ల ధర్మాసనం విచారణ జరిపి తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. 1959లో వెలువడిన రాజీ డిక్రీ ఆధారంగా ఇప్పటికే పలు న్యాయ ప్రక్రియలు పూర్తయ్యాయని కోర్టు పేర్కొంది. ఇప్పుడు పిటిషనర్ల అభ్యర్థనను అనుమతిస్తే పాత కేసును తిరిగి తెరవాల్సి వస్తుందని, అది చట్టసమ్మతం కాదని స్పష్టం చేసింది. పిటిషనర్ల దరఖాస్తులో కూడా పలు లోపాలున్నాయని తప్పు పట్టింది. ఒకసారి రాజీ డిక్రీ ద్వారా హక్కులు ఖరారైతే, ఆ వివాదం ముగిసినట్టేనని ప్రకటించింది. దశాబ్దాల తర్వాత అదే అంశాన్ని మళ్లీ కోర్టులు తెరవలేవని సుప్రీంకోర్టు తీర్పులు చెప్పిందని గుర్తు చేస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

## ఎన్నికలకు సంబంధం లేకుండా విలీన ప్రక్రియ చేపట్టాలి

### టిజిఎస్‌ఆర్‌టిసి సూపర్వైజర్స్ అసోసియేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధం లేకుండా విలీన ప్రక్రియ చేపట్టాలని టిజిఎస్‌ఆర్‌టిసి సూపర్వైజర్స్ అసోసియేషన్ ఛీఫ్ అడ్వైజర్ వాసు, ప్రెసిడెంట్ అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, సెక్రటరీ రామారావు లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారులు, ఆర్‌టిసి యాజమాన్యం, కార్మిక నాయకులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసి త్వరితగతిన విలీన ప్రక్రియను పూర్తి చేయాల్సిందిగా కోరారు. కూకట్‌పల్లి డిపోలో ఎలక్ట్రానిక్ బస్సుల ప్రారంభ సమావేశంలో బుధవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్‌టిసిలో ఎన్నికలు జరుపుతాం, ఆ తరువాతే విలీనం ప్రక్రియ అని చెప్పడంతో కార్మికుల అయోమయానికి గురవుతున్నారని, ముఖ్యమంత్రి హామీ మేరకు వెంటనే అపాయింటెడ్ డేట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

## దిగ్బంధనం ఎత్తేస్తే నెలరోజుల్లో నౌకల రాకపోకలు

### ముసాయిదా ఎంఓయు అందిందని ఇరాన్ ప్రకటన

### గడచిన 24 గంటల్లో 25 నౌకల్ని వదిలిపెట్టాం:ఐఆర్‌జిసి

**టెహ్రాన్:** తమ ఓడరేవులపై అమెరికా అమలు చేస్తున్న దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే నెలరోజుల వ్యవధిలో హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలను పునరుద్ధరిస్తామని ఇరాన్ ప్రభుత్వ టీవీ బుధవారం ప్రకటించింది.60 రోజుల్లోపు చర్చల ద్వారా ఒప్పందం కుదరితే దానిని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానంగా ఆమోదించవచ్చునని కూడా పేర్కొంది. గడచిన ఇరవైనాలుగు గంటల్లో తమ అనుమతి మేరకు 25 వాణిజ్య నౌకలను జలసంధి దాటించి మహాసముద్రంలోకి పంపించామని ఐఆర్‌జిసి (ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్) ప్రకటించింది. ఒమన్ సహకారంతో జలసంధిని నిర్వహించేందుకు ఇరాన్ సమాయత్తమైంది. ఐతే ఒమన్ సహకారంతో జలసంధి గుండా నౌకల రాకపోకలను నిర్వహించే ప్రక్రియకు సంబంధించిన విధి విధానాల ముసాయిదా ఇంకా ఖరారు కాలేదని, ఐతే ఈ రాకపోకల విషయంలో సైనిక నౌకలను మినహాయిస్తామని, ఒక స్పష్టమైన విధి విధానాలు, ధృవీకరణ లేకుండా ఇరాన్ ఎలాంటి చర్యలూ తీసుకోదని ఇరాన్ ప్రభుత్వ టీవీ ప్రకటించింది. జలసంధి నుండి వెళ్ళే నౌకల నుండి భారీస్థాయిలో సుంకాలు వసూలు చేసే ఉద్దేశం ఇరాన్‌కు లేదని, జలసంధి నిర్వహణకు సంబంధించిన ఖర్చుల ఫీజు మాత్రం వసూలు చేస్తామని, జలసంధి తమ అధీనంలోనే ఉంటుందని ఇరాన్ ప్రభుత్వం మొదటినుండీ చెబుతున్నది.

అమెరికా—ఇరాన్ మధ్య యుద్ధం ముగించడానికి సుదీర్ఘంగా కొనసాగుతున్న మంతనాలు ఒక కొలిక్కి వస్తున్నాయని గడచిన రెండు రోజులుగా సంకేతాలు వెలువడుతున్న తరుణంలో ఇరాన్ నుండి ఈ ప్రకటన వెలువడింది. ఇరుదేశాలు పరస్పర హెచ్చరికలు చేసుకుంటున్నప్పటికీ, యుద్ధం ముగించేందుకు రెండు దేశాలూ సంయమనంతో వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. శుద్ధి చేసిన అణు పదార్థాన్ని బయటకు తరలించేందుకు ఇరాన్ అంగీకరించిందని, అదే సమయంలో విదేశీ బ్యాంకుల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల్లో నాలుగోవంతు విడుదల చేసేందుకు అమెరికా అంగీకరించిందని ఈ వారారంభంలోనే వార్తలు వెలువడినప్పటికీ ఎలాంటి అధికారిక ధృవీకరణలు లేవు. దీనిపై సస్పెన్స్ కొనసాగుతోంది. లెబనాన్‌లో యుద్ధాన్ని ముగించే విషయం కూడా ఈ ఒప్పందంలో ఒక భాగంగా ఉండాలని ఇరాన్ కోరుతున్నది. అదే విధంగా పాకిస్థాన్ సహా పలు దేశాలు అబ్రహాం ఒప్పందంలో చేరాలని, ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలు నెలకొల్పుకోవాలంటూ దాదాపు ఆచరణసాధ్యంకాని అంశాన్ని ట్రంప్ తెరమీదకు తెచ్చారు. ఇవన్నీఅపరిష్కృతంగా ఉన్నాయి.

ఐతే చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి 30 నుండి 60 రోజులు గడువు కాలాన్ని కూడా నిర్దేశించారు. మరో 60 రోజులపాటు కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించాలని ట్రంప్ ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఐతే ఈ విషయంలో రిపబ్లికన్‌పార్టీలో అంతర్గత సంఘర్షణ జరుగుతోంది. ఐతే ఇది తుది ఒప్పందం కాదని, కేవలం ఒక ప్రాథమిక అవగాహన మాత్రమేనని పార్టీ నాయకులకు ట్రంప్ సర్ది చెబుతున్నారు.

ఒక మేలైన ఒప్పందం కుదురుతుందని ట్రంప్‌తోపాటు అమెరికా విదేశీ వ్యవహారాలమంత్రి మార్కో రుబియో కూడా రెండు రోజులుగా గట్టి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాల మధ్య 14 అంశాలతో కూడిన ఎంఓయుపై రెండు దేశాలమధ్యా ముమ్మరంగా సంప్రదింపులు కొనసాగాయి. యుద్ధం ముగించడానికి అమెరికాతో ఒక ఒప్పందం చేసుకోవడానికి ఉద్దేశించిన ప్రాథమిక, అనధికారిక ఎంఓయు (అవగాహన ఒప్పంద పత్రం) ముసాయిదా తమ వద్దకు చేరిందని ఇరాన్ బుధవారం ప్రకటించింది. ఈ ముసాయిదా పత్రం ప్రకారం ఒక నెల రోజుల లోపు రెండు దేశాలు తమ తమ బాధ్యతలను నిర్వర్తిస్తాయి. ఒకవైపు అమెరికా హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై విధించిన సైనిక దిగ్బంధనం అమలును ఉపసంహరించుకోవడానికి అమెరికా సెంట్రల్ కమాండ్ తన యుద్ధ నౌకలను, ఇరాన్ సమీప ప్రాంతాల నుండి తన సైనికులను వెనక్కు మళ్ళిస్తుంది. అదే సమయంలో ఇరాన్ కూడా హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలను పునరుద్ధరించేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటుంది. ఒకవేళ అమెరికా గనుక ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని తొలగించకపోతే హోర్ముజ్ జలసంధి వాణిజ్య నౌకల కోసం తెరచుకోదు. యథాపూర్వస్థితి కొనసాగుతుంది. అమెరికా గనుక దిగ్బంధనం ఎత్తివేస్తే యుద్ధానికి ముందునాటి స్థాయిలో నౌకల రాకపోకల పునరుద్ధరణ జరుగుతుంది.

## ధర్మశాలలో టిబెట్ ప్రవాస ప్రభుత్వాధినేత ప్రమాణ స్వీకారం



**ధర్మశాల:** టిబెట్ ప్రవాస ప్రభుత్వాధినేత పెన్పా త్సెరింగ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ టిబెట్ ప్రభుత్వాధినేతను సిక్యాంగ్ లేదా నాయకుడు అని పిలుస్తారు.హిమాచల్‌ప్రదేశ్ కాగ్రా జిల్లా కేంద్రం ధర్మశాల నగరంలోని టెబెటన్ ఆలయ ప్రాంగణంలో దలైలామా సమక్షంలో ఈ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిబెటన్ జాతీయ గుర్తింపును దెబ్బతీయడానికి చైనా ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నప్పటికీ, టిబెట్ ప్రజలకు మాతృభూమితో ఉన్న శాశ్వత బంధాన్ని మాత్రం చైనా ఎప్పటికీ బలహీనపరచలేదని హెచ్చరించారు.తమకు ఆశ్రయం ఇచ్చిన భారతదేశానికి, మద్దతు ఇస్తున్న అమెరికా ప్రభుత్వానికి త్సెరింగ్ హదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తాము టిబెట్ స్వాతంత్ర్యాన్ని కోరుకోవడంలేదని, స్వయంప్రతిపత్తిని కోరుకుంటున్నామని, అహింస, సంప్రదింపులు, పరస్పర ప్రయోజనాల ద్వారా చైనా—టిబెట్ సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు దలైలామా సూచించిన చిరకాల మధ్యేమార్గానికి తాము మద్దతు ఇస్తున్నామని త్సెరింగ్ చెప్పారు. సత్యంకోసం మేం చేస్తున్న ఈ పోరాటానికి మీ మద్దతు ఎంతో కీలకమైనదని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలో ఉన్న 91,000 మందిలో హిమాలయ పర్వత ప్రాంతాలలోని బౌద్ధ సన్యాసులు,దక్షిణాసియా మహానగరాలలోని రాజకీయ ప్రవాసులు, ఆస్ట్రేలియా,యూరప్,ఉత్తర అమెరికాలలో ఉన్న శరణార్థులు ఉన్నారు. సంవత్సరానికి రెండుసార్లు సమావేశమయ్యే ఈ ఈ ఐదేళ్ళ పార్లమెంటులో 45 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో మూడు సంప్రదాయ ప్రావిన్సులకు చెందిన 30 మంది, ఐదు మత సంప్రదాయాలకు చెందిన పదిమంది, ప్రవాసంలో ఉన్న మరో ఐదుగురు ఈ పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రవాసంలో ఉన్న 1.50 లక్షలమంది టిబెటన్ ప్రజలకు ఈ పార్లమెంటు ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా టిబెటర్లసంఖ్యను 60 లక్షలుగా సిటిఎ (సెంట్రల్ టిబెటన్ అడ్మినిస్ట్రేషన్) అంచనావేసింది. ఈ సిటిఎను వేర్పాటువాదుల రాజకీయ సమూహంగా చైనా భావిస్తుండగా, ఇది ప్రవాస టిటెటన్లకు ఒక కీలక సంస్థగా పనిచేస్తోంది. టిబెట్‌ను చైనా తన దేశంలో అంతర్భాంగా భావిస్తుంది. 1950లో టిబెట్‌ను స్వాధీనం చేసుకునేందుకు చైనా సైన్యాన్ని పంపింది. ఈ ప్రవాస ప్రభుత్వాన్ని చైనా రాజ్యాంగ ఉల్లంఘనగా ఆ ప్రభుత్వం భావిస్తోంది. టిబెట్‌లో 1959లో తిరుగుబాటును చైనా సైన్యాలు అణచివేశాయి. ఆ తర్వాత దలైలామా దేశం విడిచి భారత్‌లో ఆశ్రయం పొందారు. ఈనాడు దలైలామా వయసు 90 సంవత్సరాలు. ఆయన ఇంకా నిండునూరేళ్ళు జీవిస్తానని ఆశాభావంతో ఉన్నారు. బౌద్ధ నాయకుడి చివరి వారసుణ్ణి ఎంపికచేసే హక్కు తమకే ఉందని చైనా ప్రభుత్వం చెబుతుండగా, తమకే ఆ హక్కు ఉందని దలైలామా చెప్పారు.



## పలు కాలనీలను సందర్శించిన అడిషనల్ కమిషనర్

ప్రజాపక్షం/చర్లపల్లిః రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మల్కాజ్‌గిరి కార్పొరేషన్ హెల్త్, శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ అన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య పర్యవేక్షణలో భాగంగా ఏఎస్ రావు నగర్, కుషాయిగూడ, చక్రీపురం, జైలు, చిన్న చర్లపల్లి, పెద్ద చర్లపల్లి, ఇసీనగర్, రైల్వే స్టేషన్ ప్రాంతాలను ఆయన సందర్శించారు. సైనిక్‌పురి చౌరస్తాలో గల షీ టాయిలెట్స్, డ్రైనేజీ, వాటర్ కనెక్షన్ సరిగ్గా లేనందున అట్టి విషయాన్ని సంబంధిత, ఇంజనీరింగ్ అధికారులకు పనులను పూర్తి చేయాలని, చర్లపల్లి డివిజన్ ప్రాంతాలను పరిశీలించి చెత్త కుప్పలను గమనించి సంబంధిత రాంకీ సిబ్బంది ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ఎస్ డబ్ల్యుఎం డిఇ రవి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జైలు ములాఖత్ ప్రాంగణంలో లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్

ప్రజాపక్షం/చర్లపల్లిః చర్లపల్లి కేంద్ర కారాగారం ములాఖత్ ప్రాంగణంలో లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించారు. న్యూఢిల్లీ, తెలంగాణ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు సెంట్రల్ ప్రిజన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బాలభాస్కర్‌రావు డెస్క్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సత్తు రవీందర్, జైలు పర్యవేక్షణాధికారి ప్రమోద్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, జైలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కాంగ్రెస్ కృషి

ప్రజాపక్షం/ఉప్పల్ ః సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్న నేపథ్యంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు చిలుకనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్, డివిజన్ ఇంచార్జి అకిటి ఆగం రెడ్డితో కలిసి బుధవారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా రాజేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తుందని, విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల అంకితభావంతో విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలతో పోటీపడి రాణిస్తున్నారని కొనియాడారు. పాఠశాలలో గుర్తించిన సమస్యలను పరమేశ్వర్ రెడ్డి ద్వారా జిల్లా స్థాయి అధికారులకు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయుణ్ణి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు అమరేశ్వరి, నల్లవెల్లి మహేందర్ ముదిరాజ్, గండికోట గణేష్, దుండగుల శంకర్, పస్తం శ్రీరాములు, అమర్, తదితరులు పాల్గొన్నారు.

## చెరువు కుంట కబ్జాపై ఎమ్మార్వోకు ఫిర్యాదు


ప్రజాపక్షం/దుండిగల్ఃదుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలోని బహదూర్ పల్లి సంద య్య కుంట, బొబ్బఖాన్, పిర్జాది కుంట, నేరెళ్ల కుంటలు కబ్జాల కు గురికాకుండా అధికారాలు ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేయాల ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎఆర్ సాదు యాదవ్ అన్నారు. అనంతరం సాదు యాదవ్ మాట్లాడుతూ కుంటలు, చెరువులను, ప్రభుత్వ భూములను కాపాడేందుకు హైడ్రా అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్న స్థానిక



అధికారుల తీరుతో కబ్జాలకు అడ్డుకట్టపడడంలేదని అన్నారు. ఇటీవలే సందయ్యా కుంట లేక ఐడి 2854 విస్తీర్ణం 5.776 ఎకరాలు వాటర్ స్ప్రెడ్ ఏరియా 3.600 ఏకరాలుగా ఉందని కొందరు కబ్జాదారులు, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ లను ఆక్రమించి కుంట కట్టు కాలువ పైన నిర్మాణాలు చేస్తున్నారని ఇటీవలే సందయ్యకుంట కబ్జాపై వార్త కథనాలు రావడం జరిగిందని అధికారం చర్యలు చేపట్టడం లేదని అన్నారు. దుండిగల్ మండల ఎమ్మార్వో ఎన్.రాజేశ్వర్ రెడ్డి చర్యలు చేపట్టాలని ఆయన వినతిపత్రం అందజేశారు. ఇరిగేషన్ అధికారులకు కూడా దృష్టి సారించి చెరువులు కుంటలు, కట్టు కాలువలు కాపాడాలని అన్నారు. త్వరలోనే హైడ్రా కమిషనర్ ఎవి. రంగనాథ్‌ను కలిసి చెరువులు, కుంటల కబ్జాలపై ఫిర్యాదులు అందజేస్తామని అన్నారు.

## పాఠశాలకు లాప్‌టాప్స్ విరాళం

ప్రజాపక్షం/శామీర్‌పేట ః అలియాబాద్ మున్సిపాలిటి తుర్కపల్లిలోని సాయిలైఫ్ సైన్సెస్ కంపెని ప్రతినిధి అశోక్ నారాయణ జగ్గంగూడలోని మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలకు 5 హెచ్‌పి లాప్‌టాప్స్(కంప్యూటర్లు), ప్రొజెక్టర్ విరాళంగా అందజేశారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపల్ జగ్గంగూడలోని గురుకుల మైనార్టీ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్ అధ్యక్షత న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా



మైనార్టీ వెల్ఫేర్ అధికారి కాంతమ్మ మాట్లాడుతూ సాయిలైఫ్ సైన్సెస్ కంపెనీ ప్రతినిధి అశోక్‌నారాయణ అందించిన లాప్‌ట్యాప్‌లను విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపయోగపడుతాయని అన్నారు. ఈ పరికరాలను బాధ్యతయుతంగా సమర్ధవంతంగా వినియోగిస్తామని చెప్పారు. మరిన్ని సేవా కార్యక్రమాలను సాయిలైఫ్ సైన్సెస్ నుంచి ఆశిస్తున్నామని ఆశాబావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణ, కళాశాల కోఆర్డినేటర్ పిఎల్ నర్సారెడ్డి, దుర్గేష్, తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులో నిరుపేదలకు ప్రాధాన్యం

### మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/కూకట్‌పల్లిఃఅర్హులైన నిరుపేదలందరి కీ దశలవారీగా డబుల్ బడ్‌రూమ్ ఇళ్లు అందించడ మే ప్రభుత్వ ధృడసంకల్పమని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఇంచార్జీ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కైతలాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కమ్మ సంఘం అధ్యక్షులు బండి రమేష్, జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫతేనగర్ పరిధిలోని అమృత్ నగర్ తండా నిర్వాసితులైన 62మంది గిరిజన నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చిన తర్వాత ఇళ్ల కేటాయింపు జరిగిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్న నేపథ్యంలో స్థలం, ఇల్లు లేనివారికి ఎలాంటి వివక్ష లేకుండా దశలవారీగా రూ.5లక్షల ఆర్థిక సహా యం అందిస్తామని పేర్కొన్నారు.

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థలను ఆధునీకరిస్తున్నామని, ఫ్లైఓవర్లు, రోడ్డు విస్తరణ పనులకు రూ.15.5కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాల ను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మహిళా శక్తి బ్యాంక్ లింకేజ్, వడ్డీలేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలు మహిళా సాధికారతకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు మూసీ నది ప్రక్షాళన, చెరువుల పునరుద్ధరణ, అక్రమాల నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు లబ్ధిదారుల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. కైతలాపూర్‌లో 144 మందికి ఇళ్ల మంజూరు జరగగా ప్రస్తుతం 62మందికి కేటాయింపులు చేసినట్లు, మిగిలిన అర్హులకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు దశలవారీగా ఇళ్లు అందజేస్తామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఆర్టీఓ శ్యాంప్రకాష్, కూకట్‌పల్లి ఎమ్మార్వో స్వామి, హౌజింగ్ పిడి రమణ మూర్తి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## 60 ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభం

ప్రజాపక్షం /కూకట్‌పల్లి ః కూకట్‌పల్లి డిపోకు 60 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించిన సందర్భంగా బుధవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారా వు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్‌లతో కలిసి ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో పలు సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో 545 ఈవీ బస్సులు నడుస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మరో 2,200 ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. నగరంలో కొత్త కాలనీలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజా రవాణా వ్యవస్థ ను కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పా రు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు కొత్త బస్సుల కొనుగోలు ద్వారా మహిళలను యజమానులుగా నిలబెట్టామని పేర్కొన్నారు. ప్రజా రవాణాలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందు కు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, త్వరలోనే ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని హామీ ఇచ్చారు. కూకట్‌పల్లి డిపో విస్తరణలో భాగంగా 5ఎకరాల స్థలంలో కొత్త డిపో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. కూకట్‌పల్లి ప్రాంతాన్ని కాలుష్య రహిత ప్రాంతంగా మార్చడంలో ఈవీ బస్సులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటూ ఆర్టీసీ అభివృద్ధి కోసం ప్రతి ఉద్యోగి కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

## మహిళా ఉద్యోగినుల భద్రతే లక్ష్యం

### ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో






ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మహిళలు పని చేసే ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో పోష్ యాక్ట్ 2013 (లైంగిక వేధింపుల నివారణ చట్టం) మేరకు విధిగా అంతర్గత ఫిర్యాదు కమిటీ (ఇంటర్నల్ కంప్లెయింట్స్ కమిటి) ఏర్పాటు చేయాల్సి ఉంటుందని మహిళా మరియు శిశు సంక్షేమ శాఖాధికారి అనితా రాంచంద్రన్ ఆదేశించారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో బుధవారం జరిగిన మహిళా భద్రత, రక్షణ వారోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా సంస్థల్లో పని చేసే మహిళా కార్మికులు, ఉద్యోగినులు సహచర ఉద్యోగులచే ఎలాంటి లైంగిక వేధింపులకు గురైనా అదే సంస్థలో ఉండే కమిటీ కి ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ప్రతి జిల్లాలో లోకల్ కంప్లెయింట్స్ కమిటీ సైతం ఏర్పాటు చేసామన్నారు. మహిళా ఉద్యోగినుల భద్రత కోసం భారత ప్రభుత్వం తీసుకొని వచ్చిన ఈ చట్టం కార్యాలయాల్లో పనిచేసే మహిళలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించటమే అని తెలిపారు. పదిమంది కంటె తక్కువ ఉద్యోగులున్న సంస్థకు చెందిన బాధిత మహిళలు జిల్లా స్థాయిలో ఫిర్యాదు చేయవచ్చాన్నారు. అదే విధంగా బాధిత మహిళలు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు https://shebox. wcd.gov.in అందుబాటులో తెచ్చిందన్నారు. ఈ చట్టం సక్రమంగా అమలయ్యేందుకు గాను రెవెన్యూ డివిజన్ అధికార్లు, మండల రెవెన్యూ అధికారులు, ఎవిసిలో నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిపిసిఆర్ కమిషన్ సభ్యులు చందన, జిల్లా శిశు సంక్షేమ అధికారి శారద, బాలరక్ష భవన్ కోఆర్డినేటర్ తిరుమలదేవి, కుత్బుల్లాపూర్ ఐసిడిఎస్ పిడి రేణుక, ఆల్వాల్ పిడి స్వాతి, జిల్లా అధికారు లు, సఖి బృంద సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ జోన్‌లో జనగణన సమావేశం

ప్రజాపక్షం/ఉప్పల్ ః జనగణన పనులను ఖచ్చితత్వంతో, పారదర్శకంగా మరియు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం ఉప్పల్ జోనల్ మీటింగ్ హాల్‌లో జనగణన కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో అన్ని సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, కోఆర్డినేటర్లు , సూపర్వైజర్లు పాల్గొన్నారు. ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, హౌస్ లిస్టింగ్, డేటా సేకరణ పనులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని జోనల్ కమిషనర్ సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పని చేయాలని, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.





## ఇందిరమ్మ కాలనీ సమస్యలను పరిష్కరించండి

### నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్

ప్రజాపక్షం/ నిజాంపేట్ ః నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వాకలపూడి రంగరాయ ప్రసాద్ కోరారు. జీడిమెట్ల, దండమూడి ఎన్‌క్లేవ్ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో మాజీ కార్పొరేటర్ వాకలపూడి రవికిరన్‌తో కలిసి రంగరాయ ప్రసాద్ ఎమ్మెల్యే కెపి వివేకానందని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రంగరాయ ప్రసాద్, రవికిరణ్‌లు మాట్లాడుతూ నిజాంపేట్, ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 3లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తక్షణమే పరిష్కరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే వివేక్ వాటర్ వర్క్స్ జిఎంతో మాట్లాడి ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించి తనకు నివేదించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రంగరాయ ప్రసాద్, రవికిరణ్‌లతో పాటు ఇందిరమ్మ కాలనీ వాసులు వివేక్‌కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## క్రీడా కాంప్లెక్స్‌లను యువత సద్వినియోగం చేసుకోవాలి

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద



ప్రజాపక్షం/నిజాంపేట్ః తెలంగాణ యువ త క్రీడా కాంప్లెక్స్‌లను సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలో జిహెచ్‌ఎంసి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణపు పనులను జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి ఎమ్మెల్యే వివేక్ పరిశీలించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనుల పురోగతిని, పనుల వివరాలను వివేక్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ తెలంగాణ యువత మానసిక ఉల్లాసంతోపాటు శారీరకం గా ధృఢత్వంతో ఉండాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. జిహెచ్‌ఎంసి నుండి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను నిర్మించడం సంతోషకరమని, ఇలాంటి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బ్యాడ్మింటన్, రన్నింగ్ ట్రాక్, ఫుట్ బాల్, యోగా సెంటర్‌తో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో వ్యాయామం చేసుకోవడానికి అన్ని రకాలుగా సదుపాయాలను ఏర్పాటు చేస్తా మని తెలిపారు. ఛాంపియన్ షిప్‌లను సైతం నిర్వహించేలా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను చేపడుతున్నామని, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి క్రీడాకారులకు, సమీప కాలనీల వాసులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకట రాములు, డిఇ అనురాగ్, ఎఇ కళ్యాణ్, యుబిడి సర్కిల్ మేనేజర్ విజయ రాణి, నాయకులు పాల్గొన్నారు.

## యువకుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్



ప్రజాపక్షం/జవహర్‌నగర్: కూలీ డబ్బుల విషయంలో తోటి కార్మికుల మధ్య తలెత్తిన వివాదం కారణంగా గత వారం జరిగిన ఓ యువకుడి హత్య కేసులో నిందితుడిని జవహర్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇనస్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం మహరాజ్ గంజ్ జిల్లాకు చెందిన రాజ్‌పుత్ అజయ్ రాయ్ అలియాస్ జీనత్ (30) అంబేద్కర్‌నగర్‌లో ఉంటూ పెయింటింగ్ పనులు చేసుకొంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 18న అతడు స్నేహితుడు అనిల్ కుమార్‌తో కల్సి మద్యం సేవించి అనిల్ కుమార్ ఇంటికి తిరిగి వచ్చి మరో స్నేహితుడు రోహిత్‌తో కల్సి మరోసారి మద్యం సేవించారు.

గతంలో తాను చేసి న పెయింటింగ్ పనుల నిమిత్తం తనకు ఇవ్వాల్సిన డబ్బులకు తోడు మరో 8 వేల రూపాయలు ఇవ్వాలని అజయ్ అడిగాడు. దీంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న అజ య్, రోహిత్‌లు కల్సి డబ్బులు ఇవ్వనంటూ దూషిస్తూ ఘర్షణ పడి అక్కడే ఉన్న కర్రతో తల వెనుక, వీపుపై తీవ్రంగా కొట్టారు. దీంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందిన అనిల్‌ను చూసి అతడి సెల్‌ఫోన్ తీసుకొని నిందితులిద్దరూ అక్కడి నుండి పరారయ్యారు. స్థానికుల సమాచారంతో అనిల్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొన్న పోలీసులు దర్యాప్తులో భాగంగా నిందితుల వద్ద ఉన్న సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితుడు అజయ్ రాయ్ ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



## ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మర్రి రూ.10 లక్షలు

ప్రజాపక్షం/మల్కాజిగిరి: వాయుపురి కాలనీలో అర్ధాంతరంగా నిలిచి పోయిన ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి తన వంతుగా రూ.10లక్షలు సాయం చేస్తున్నానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. బుధవారం ఆయన వాయుపురిలో నిర్మాణంలో ఉన్న భవనాన్ని ఆయన పరిశీలించిన సందర్భంగా ఈ మేరకు హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఈ ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణంకోసం గతంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సైతం ఆర్థికంగా సాయం చేసారని, త్వరలోనే ఈ భవనం పూర్తవుతుందన్న ఆశాభావాన్ని రెండు ప్రెస్‌క్లబ్‌ల ప్రతినిధులు వ్యక్తం చేసారు.

## బండి భగీరథ్ -అరణ్య ఫాంహౌజ్‌కి సీన్ రీకన్‌స్ట్రక్షన్ యత్నం



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ్‌ను మూడు రోజు ల పోలీస్ కస్టడీలో భాగంగా పేట్ బషీరాబాద్ పోలీసులు బుధవారం చర్లపల్లి కేంద్ర కారాగారం నుండి కస్టడీకి తీసుకొన్నారు. అక్కడి నుండి నేరుగా మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొని వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసు అధికారుల బృందం (సిట్) నిందితుడిని కొన్ని ప్రశ్నలు సంధించిన అనంతరం సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం మొయినాబాద్‌లోని అరణ్య ఫాంహౌజ్‌కి భగీరథ్‌ను తీసుకొని వెళ్లారు. కాగా ఫాంహౌజ్‌లో అనుకోకుండా మరో కార్యక్రమం జరుగుతుండటంతో ఆశించిన మేరకు సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసేందుకు వీలు కుదరకపోవటంతో కీలక ఆధారాలు సేకరించేందుకు నిందితుడిని కొన్ని ప్రశ్న లు అడిగి పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. న్యాయస్థానం అనుమతించిన మూడు రోజుల పోలీస్ కస్టడీలో మిగిలిన రెండు రోజుల్లో ఎలాగైనా వీలైనంతగా కీలక ఆధారాలు సేకరించే పనిలో సిట్ బృందం లక్ష్యంగా ఏర్పా టు చేసుకొని కేసు దర్యాప్తు వేగవంతం చేయటం ద్వారా నిందితుడి నుండి పూర్తి స్థాయిలో సమాచారాన్ని సేకరించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్లనుంది.

## రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాపక్షం/శామీర్‌పేట ః శామీర్‌పేట మండలంలోని రైతులకు సబ్సిడిపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని శామీర్‌పేట మండల వ్యవసాయాధికారి రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనుము 40 కిలోల బస్తా పూర్తి ధర రూ. 6220 సబ్సిడి రూ. 3110 రైతు ధర రూ. 3110, జీలుగ 30 కిలోల పూర్తిధర రూ. 4905 సబ్సిడి రూ. 2452 రైతుధర రూ. 2452 ఉందని చెప్పారు. 50 శాతం సబ్సిడిపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు పట్టాదార్ పాసుపుస్తకంతో మండల వ్యవసాయ విస్తరణ అధికారిని కలువాలని పేర్కొన్నారు. ఇట్టి అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ రమేష్ కోరారు.

## మహిళలపై లైంగిక వేధింపుల నివారణ — నిషేధం పరిష్కారచట్టంపై అవగాహన



ప్రజాపక్షం/వికారాబాద్ ః మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్దుల సంక్షేమ ఆధ్వర్యంలో వికారాబాద్ మున్సిపల్‌లో, అవగాహన కార్యక్రమం నిర్వహించారుఈ. ఈకార్యక్రమనికి జిల్లా సంక్షమ అధికారి కృష్ణవేణి పాల్గోని మాట్లాడుతూ పని ప్రదేశాలలో మహిళలపై పరిష్కారచట్టం 2013 పై మహిళలకు వివరించారు. ప్రభుత్వ కార్యాలయల్లో ,ప్రైవేట్ సంస్థలతో పాటు ,ఇళ్లల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్ష ఉంటాయని తెలిపారు. అశ్లీల చిత్రలను చూపించడం ,లైంగిక స్వభవం గల మాటల ద్వారా ఎద్దైన అవాంచనీయ సంఘటన, ప్రవర్తనకు సంబంధించి ఫిర్యాదుల ను పరిష్కరించడమే ఈ పిఓఎచ్ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశమని బాదితులు90రోజుల్లో ఇంటర్నల్ కమిటీ , పీబాక్స్ పోర్టల్ ద్వారా అలైన్ ద్వారా ఫర్యాదు చేయవచ్చని సూచించారు. ఫిర్యాదులు జిల్లా కలెక్టర్ ,అదనపు కలెక్టర్ కు ఫిర్యాదులు చేయవచ్చి తెలిపారు. అధికారులకు చట్టంపై అవగాహన లేక నష్టం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, శ్రీకాంత్, వరలక్ష్మి ,రాందస్ అంజనేయులు తదితరులు పాల్గోన్నారు.



## పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాపక్షం/పరిగిః ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధ్వర్యంలో రైతులకు 50శాతం సబ్సిడీపై రైతులకు పచ్చి రొట్టె విత్తనాలు పంఫిణి చేసిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అనంతరం పరిగి మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్దిదాలరులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజురైన చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పచ్చిరొట్టె సాగు ద్వారా భూమి సారవంతం పెరిగి రైతులకు మంచి దిగుబడులు లభిస్తాయని తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

